## క్లుప్తంగా

### బ్రిడ్జిల తనిఖీ



వాజేడు: మండలంలోని పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న కల్వర్టులు, బ్రిడ్జీలను పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు తనిఖీ చేశారు. భద్రత కారణాల దృష్ట్యా తనిఖీలు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రతీ బ్రిడ్జిని, కల్వర్టును క్షుణ్ణంగా పరిశీలించారు.

### వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



కాటారం: రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు పార్లమెంట్ ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ కాటారం మండల ఇన్‌చార్జ్ చంద్రగిరి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నస్తూర్‌పల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అశోక్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ కోసం ఈ నెల 30న నిర్వహించనున్న చలో భూపాలపల్లి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ 29 సంవత్సరాలుగా పోరాటం చేస్తుందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెడుతామని హామీ ఇచ్చి తొమ్మిది సంవత్సరాలుగా మోసం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి ఎస్సీ వర్గీకరణ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మిషన్ 25డేస్‌లో భాగంగా నస్తూర్‌పల్లి నూతన కమిటీని ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంథెన చిరంజీవి, శ్రీను, నరేశ్, అకాశ్, సంతోష్ పాల్గొన్నారు.

### కమిటీ ఎన్నిక

కాటారం: మండలం రేగులగూడెం మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీలను ఆదివారం ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా చిగురు లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ రుమాన, ఉపాధ్యక్షుళ్లుగా తుమ్మటి రాజేశ్వరి, గంధం తిరుమల, సంయుక్త కార్యదర్శిగా పస్తం కొమురయ్య, కోశాధికారిగా నూకల కాంత, ప్రచార కార్యదర్శిగా గద్దె లక్ష్మి, యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నంది శశికుమార్, ఉపాధ్యక్షులుగా సాదారి క్రాంతికుమార్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా తూటి నారాయణ, ఉపాధ్యక్షుడిగా కల్వపల్లి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా నరేశ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీలను కాంగ్రెస్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వంశీవర్ధన్‌రావు, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న, ఉపాధ్యక్షులు గద్దె సమ్మిరెడ్డి, సర్పంచ్ అంగజాల అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### నియామకం



కాటారం: మేదరి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆ సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు గైని రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జొర్రిగల శ్రీనివాస్ ఆదివారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి రాష్ట్ర అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్, కోశాధికారి పాతకోటి ఉమ, ప్రచార కార్యదర్శి ప్యారసాని రమాకంత్‌తో పాటు రాష్ట్ర , జిల్లా, మండల నాయకులకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. రమేశ్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# కొట్టుకుపోతోంది!

- వర్షాకాలంలో కోతకు గురవుతున్న గోదావరి ఒడ్డు
- కరకట్ట నిర్మించాలని కోరుతున్న ప్రజలు



వరదల నుంచి వాజేడును కాపాడుతున్న చిన్న గడ్డ

వాజేడు: జీవన గంగైన గోదావరి రైతుల పాలిట శాపంగా మారింది. ప్రతీ ఏడాది వచ్చే వరదల కారణంగా కోత కోస్తూ రైతుల భూములను తనలో కలుపుకుంటుంది. దీంతో రైతుల చేతుల్లో పట్టాలు ఉన్నప్పటికీ సాగు చేసుకోవడానికి భూములు కానరావడం లేదు. చేలు, పొలాలు కరిగి పోయి ఇసుక మాత్రమే మిగులుతుంది. మండల పరిధిలోని లొట్టిపిట్ట గండి నుంచి ఏడ్జర్లపల్లి గ్రామం వరకు మండల వ్యాప్తంగా గోదావరి పరివాహకం వెంట వందలాది ఎకరాల భూములు కోతకు గురైనట్లు రైతులు వాపోతున్నారు. రికార్డుల ఆధారంగా రైతులకు భూములు ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని దుస్థితి. దాదాపు వందలాది ఎకరాల వరకు పంట భూములను నష్టపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు.

**మండలానికి పొంచి ఉన్న ముప్పు**

వాజేడు మండలానికి గోదావరి నుంచి ముప్పు పొంచిఉంది. తుపాకులగూడెం వద్ద నిర్మించిన బ్యారేజి నుంచి వర్షాకాలంలో దిగువకు విడుదల చేసే క్రమంలో మండల పరిధిలోని చంద్రుపట్ల, టేకులగూడెం, పేరూరు ఇలా పలు గ్రామాల సరిహద్దుల్లో భూములు కోతకు గురవుతున్నాయి. కంతెనపల్లి, చింతూరు గ్రామల మధ్య నుంచి నేరుగా వచ్చిన గోదావరి వాజేడు వద్ద దరికి తగులుతుంది. దీంతో వాజేడు వద్ద గోదావరి ఒడ్డు ప్రతీ సంవత్సరం కొంత మేర కోతకు గురవుతుంది. గోదావరి వరద నేరుగా రాకుండా నీటి ప్రవాహం ఒడ్డును తగిలే ప్రదేశంలో మధ్యలో ఉన్న చిన్న గడ్డ అడ్డుకుంటుంది. ప్రస్తుతం ఆ గడ్డనే వాజేడును కాపాడుతుంది. చిన్న గడ్డ సైతం ప్రతీ సంవత్సరం కొంత మేర కోతకు గురవుతుంది. గతంలో ఉనన పెద్ద గడ్డ సుమారుగా 400 ఎకరాల మేర ఉండేది. గోదావరి కోతల మూలంగా నేడు ఆ గడ్డ మొత్తం కనుమరుగైంది. ఆ తరువాత చిన్న గడ్డ గోదావరి వరదను రాకుండా అడ్డుకుంటున్నప్పటికీ అది కూడా కోతకు గురై కొంత భాగం మాత్రమే మిగిలింది. 2022లో సంవత్సరం వర్షాలు అధికంగా కురువడంతో ఆ గడ్డ కూడా భారీగా తరిగిపోయింది. ఈ ఏడాది కూడా గోదావరి వరదలు ఎక్కువగా ఉంటే పరిస్థితి ఏంటని మండలవాసులు భయపడుతున్నారు.

**కరకట్టే శరణ్యం**

వాజేడు మండలానికి గోదావరి నుంచి ప్రమాదం లేకుండా ఉండాలంటే లొట్టిపిట్టగండి నుంచి ఏడ్జర్లపల్లి గ్రామం వరకు కరకట్ట ఒక్కటే మార్గం. మండలలోని గోదావరి పరివాహకాన్ని పట్టుకుని కరకట్ట కట్టాల్సి ఉంటుంది. లేకపోతే మండలానికి గోదావరి వలన ప్రమాదం పొంచి ఉంది. ప్రతీ ఏడాది గోదావరి కోత వలన కొంత మేర ఒడ్డును, పంట చేలను కోల్పోతున్న మండల ప్రజలు, రైతులు తమకు కరకట్ట కట్టి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరావు దృష్టికి తీసుకువెళ్లారు. కాని ఇప్పటి వరకు దాని ఊసే లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరకట్ట నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన పంట భూమి



భూమి కొట్టుకుపోయి తేలిన రాళ్లు



లొట్టిపిట్ట గండి వద్ద గోదావరి

## బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న సీతక్క

ములుగు రూరల్: ములుగు మండలంలోని మదనపెల్లి గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ కొర్ర భీంసింగ్, కానిస్టేబుల్ కొర్ర జయసింగ్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క ఆదివారం పరామర్శించారు. అలాగే ములుగు పట్టణ కేంద్రానికి చెందిన ఒజ్జల కొమురయ్య, పైడాకుల మల్లేష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పొడాల ఓం ప్రకాష్, ఎంపీటీసీ మావురపు తిరుపతి రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుంటోజు శంకరయ్య, పారక బ్రదర్స్, యాక రాజు తదితరులు ఉన్నారు.

### ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలో కాల్వపల్లి గ్రామానికి చెందిన సారంపెల్లి ఉప్పల్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆదివారం పరామర్శించారు. మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి రూ.5వేల సాయం అందజేశారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేష్, నాయకులు కొమురయ్య, సత్యం, పత్తి గోపాలరెడ్డి, బాబురావు, సెలమయ్య, చల్లా రజినికర్‌రెడ్డి నారాయణ, కార్తీక్ సంపత్, బాబురావు, ఉషాలు, మహేందర్, లక్ష్మయ్య, వాసం రవి, రాజు, నర్సింహులు, లాలయ్య, శ్రీను, రమేష్, సందీప్ పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: ముదిరాజ్‌లను కులం పేరుతో దూషించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి భేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు దేవేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మొదటి అమరుడు కృష్ణయ్య ముదిరాజ్‌పాటుతో ఎంతో మంది ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం బలిదానాలు చేశారన్నారు. అలాంటి జాతిని కించపర్చే విధంగా మాట్లాడడం సమాజసం కాదన్నారు. ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న ముదిరాజ్ ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటమల్లు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, నర్సింగారావు, రఘు, నాయకులు సాంబయ్య, రవి పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

భూపాలపల్లి రూరల్: నందిగామ బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగమల్ల బోసు ఆధ్వర్యంలో భూపాలపల్లి మండలంలోని నందిగామ గ్రామంలో పట్టణానికి చెందిన సురక్ష ఆస్పత్రి యాజమాన్యం ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నందిగామ, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

## చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ నవనిర్మాణ సేన మండల అధ్యక్షుడు కుంజా మహేష్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో ఆదివాసీ నవనిర్మాణ సేన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను అమలు చేయటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఏజెన్సీలో ఆదివాసీలకు సాగు భూమి 15 ఎకరాలు ఇవ్వాలన్నారు. అధికారులు ఆదివాసీ చట్టలను అమలుచేయకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పూనెం లక్ష్మయ్య, కుర్సం నాగేష్, బొగ్గుల దేవయ్య, గట్టుపల్లి రామయ్య తదితరులు ఉన్నారు.

## దేశ కీర్తిని తగ్గించిన కాంగ్రెస్

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పాలించి కీర్తిని తక్కువ చేసిందని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జూన్ 25 ఎమర్జెన్సీ డే చీకటి రాజ్యంను పురస్కరించుకొని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపుడి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీరాములు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 1975 జూన్ 25న ఇందిరాగాంధీ ఎన్నికలు చెల్లవని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సందర్భంగా ఇందిరాగాంధీ పదవి కాపాడుకోవడానికి దేశానికి ఎమర్జెన్సీని ప్రకటించడం జరిగిందన్నారు. ఈ ఎమర్జెన్సీ కాలంలో దాదాపు రెండేళ్లుగా ప్రతిపక్ష రాజకీయ, ఉద్యమ నాయకులను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి నిర్బంధాలు చేసి చీకటి రాజ్యంగా దేశాన్ని పరిపాలించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సెల్ కన్వీనర్ మురళి మనోహర్, ములుగు అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, జిల్లా నాయకులు భూక్య జవహర్‌లాల్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జినుకల కృష్ణాకర్ రావు, జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్, మండల అధ్యక్షుడు జక్కుల కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజుకు చేరిన 'ఇంటింటికీ బీజేపీ'



భూపాలపల్లి రూరల్: ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో కీర్తిరెడ్డి



చిట్యాల: సన్మానిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: కేంద్రంలో బీజేపీ పాలన 9 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా చేపట్టిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమం ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు సుభాష్ కాలనీ, 18వ వార్డు గాంధీనగర్ కాలనీల్లో కొనసాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి హాజరై ఇంటింటికి వెళ్లి సేవా, సుపరిపాలన, పేదల సంక్షేమ పథకాలను వివరించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాజన్ సంపర్క్ అభియన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22 నుంచి 30 వరకు ప్రతిరోజు బూత్ పరిధిలో 100 కుటుంబాలను కలిసి మోదీ సాధించిన అద్భుతాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, మధుసూదన్‌రెడ్డి బట్టు రవి, తుమ్మేటి రామ్‌రెడ్డి , కోరే సుధాకర్, కరివేద మనోహర్ రెడ్డి, మండల రఘునాథ్‌రెడ్డి, తాండ్ర హరీష్ , సిలువేరు కార్తీక్, చింత కింది అఖిల్, వట్టెం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎమర్జెన్సీ కాలంలో జైలు జీవితం గడిపినటువంటి సీనియర్ నాయకులు నాగపురి రాజమౌళి గౌడ్, లింగంపల్లి జగన్ మోహన్‌రావు, కనుకుల లక్ష్మారెడ్డి , బుర్ర సాంబయ్య, మండల రాఘవరెడ్డిలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇంచార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ఆనాడు ప్రధాని అయినటువంటి ఇందిరా గాంధీ ఒక నియంతృత నియంత పోకడతోనే దేశంలో అల్ల కల్లోలం సృష్టించి అవసరం లేకున్నా కూడా ఎమర్జెన్సీ ప్రకటించి దేశంలో ఉన్నటువంటి ప్రజలను ఆ కారణంగా చిత్రహింసలకు గురి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రామచంద్రరెడ్డి, చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు లింగంపల్లి ప్రసాద్ రావు, రాష్ట్ర నాయకులు బట్టు రవి, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు, సుధగని శ్రీనివాస్, కోటేశ్వర్‌రెడ్డి, అశోక్ చారి, గజనాల రవీందర్, రాజేందర్, రవీందర్, పాలకుర్తి భిక్షపతి, చంద్రమౌళి, శ్రీశైలం అశోక్, రాయిని శ్రీనివాస్, శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పంటలు సమృద్ధిగా పండాలి



వాజేడు: సామగ్రిని తీసుకువెళ్తున్న గ్రామస్తులు



వెంకటాపురం(కె): పూజలు చేస్తున్న మహిళలు

వెంకటాపురం(కె): పంటలు బాగా పండాలని నేతకాని సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అడవి తల్లికి పూజా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. రెండు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తుండటంతో నేతకాని కుల సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సమేతంగా అటవీ ప్రాంతానికి వెళ్లి పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సంఘం వ్యవస్థపాక అధ్యక్షులు జాడి ఈశ్వర్, గ్రామస్తులు జిమిడి సమ్మక్క, గోగు సమ్మయ్య, జాడి వెంకటేశ్వర్లు, దేవయ్య, చిన సమ్మయ్య, శ్రీను, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



వాజేడు: పూజలు నిర్వహిస్తున్న గుమ్మడిదొడ్డి గ్రామస్తులు

**ఘనంగా ఎల్ల నంపుడు పండుగ**

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి, వాజేడు, జంగాలపల్లి గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతల(ఎల్ల నంపుడు) పండుగను ఘనంగా నిర్వహించారు. వర్షాలు పడగానే వ్యవసాయ పనులకు సన్నద్ధం కావడం కోసం ముందస్తుగా ఈ పండుగను నిర్వహిస్తారు. అదే విధంగా గ్రామంలోనికి ఎలాంటి దుష్టశక్తులు రాకుండా ఉండటం, పంటలు పుష్కలంగా పండటం కోసం గిరిజనులు తమ సంప్రదాయ పద్ధతుల్లో ఈ పండుగను జరుపుకుంటారు. ఈ మేరకు గుమ్మడిదొడ్డి గ్రామంలో గ్రామస్తులు గ్రామ దేవతల గుడి వద్ద నుంచి ఒక బేషన్‌లో విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పరికరాలను తీసుకుని వాటిపై కర్రలతో కొడుతూ ఊరి పొలిమేర వరకు తీసుకువచ్చారు. గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో అక్కడ చిన్న పందిరిని వేసి పూజలను నిర్వహించారు. జంగాలపల్లి, వాజేడు గ్రామాల్లో గ్రామ దేవతల గుడి వద్ద నుంచి చెక్కలతో తయారు చేసిన చిన్న బండిని పూజల అనంతరం తీసుకు వెళ్లి గ్రామం చివరలో ఉంచారు. అనంతరం గుడుల వద్ద మొక్కులను సమర్పించి పంటలు పుష్కలంగా పండాలని కోరుకున్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మొగుళ్లపల్లి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



కాటారంలో..

మొగుళ్లపల్లి: మండలంలోని పిడిసిల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులు ధర్మయ్య, వెంకట్రాజం, డివియస్ చారిలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని వివేకనంద పాఠశాలలో 2008–09 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకొన్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. పలు రంగాల్లో పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఒక్క చోట కలుసుకొని పత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివేకనంద పాఠశాల కరస్పాండెంట్ వలుస వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వందన, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### జాగ్రత్తగా నడపాలి



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వాజేడు: ఆటోలు జాగ్రత్తగా నడపలని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. మండల పరిధిలోని జగన్నాథపురంలో ఆదివారం ఆటో డ్రైవర్లతో ఎస్సై మాట్లాడారు. స్థాయికి మించి ప్రయాణికులను తీసుకు వెళ్లవద్దని చెప్పారు. ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ వాహనదారుడికి ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా ఉండాలని ఆదేశించారు.